
సాక్షి
బాపట్ల

శనివారం । 1 । జూన్ । 2024



నాగవల్లీ దళార్చన

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): పాతగుంటూరు విశాఖ శ్రీశారదా పీఠ పరిపాలిత వీరాంజనేయస్వామి దేవస్థానంలో శుక్రవారం లక్ష నాగవల్లీ దళార్చన చేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 504.70 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 800 క్యూసెక్కులు విడుదలవుతోంది.

హనుమాన్‌కు ఫల, పుష్పాలంకరణ



సత్తెనపల్లి: పట్టణంలోని మహారాష్ట్ర వీధిలో ఉన్న భక్తాంజనేయస్వామి దేవస్థానంలో హనుమత్ జయంతి వేడుకల్లో భాగంగా శుక్రవారం స్వామివారికి పంచామృత అభిషేకాలు, హనుమత్ హోమం, విశేష ఫల పుష్పాలంకరణ చేశారు.

న్యూస్‌రీల్

ఘనంగా ఆంజనేయస్వామి వార్షికోత్సవం



వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని గుంటి ఆంజనేయస్వామి 44వ వార్షికోత్సవం, హనుమాన్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. స్వామివారికి అష్టోత్తర శత కలశ అభిషేక స్నాపన, తిరుమంజనం, హోమాలు, విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వార్షికోత్సవం చివరి రోజు శనివారం హనుమాన్ జయంతి సందర్భంగా స్వామివారికి పంచామృత అభిషేకాలు, విశేష అర్చనలు, హనుమత్ వ్రత మహోత్సవాలు ఉంటాయని అర్చకులు శ్రీమన్నారాయణ జయచంద్, ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అనంతరం అన్నప్రసాద వితరణ జరుగుతుందని చెప్పారు.

ముగిసిన పది సప్లిమెంటరీ పరీక్షలు

నరసరావుపేటఈస్ట్: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారంతో ప్రశాంతంగా ముగిశాయి. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటుచేసిన 23 పరీక్ష కేంద్రాలలో శుక్రవారం 1,963 మంది విద్యార్థులకు గానూ 1,133 మంది హాజరయ్యారు. మరో 830 మంది గైర్హాజరైనట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు తెలిపారు. పరీక్షలు ప్రశాంతంగా ముగియడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. పరీక్షలు సజావుగా సాగేందుకు కృషి చేసిన ఉపాధ్యాయులు, సిబ్బందిని అభినందించారు. పరీక్షల సందర్భంగా ఎటువంటి సమస్యలు తలెత్తలేదన్నారు. వేసవి దృష్ట్యా పరీక్ష కేంద్రాల వద్ద తాగునీరు, ఫ్యాన్లు, ఇతర మౌలిక వసతులను కల్పించామని తెలిపారు.

పాలిసెట్ సర్టిఫికెట్ల పరిశీలనకు 246 మంది



గుంటూరు ఎడ్యుకేషన్: పాలిసెట్–2024 కౌన్సెలింగ్‌లో భాగంగా నల్లపాడులోని ఎంబీటీఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో నిర్వహిస్తున్న సర్టిఫికెట్ల పరిశీలనకు శుక్రవారం 246 మంది విద్యార్థులు హాజరయ్యారు. హెల్ప్‌లైన్ కేంద్ర సమన్వయకర్త టి.శేఖర్ పర్యవేక్షణలో వివిధ శాఖల అధికారులు పాల్గొని విద్యార్థుల సర్టిఫికెట్లు పరిశీలించారు. కాగా శనివారం జరగనున్న సర్టిఫికెట్ల పరిశీలనకు 75,001 నుంచి 92 వేలు ర్యాంకు వరకు విద్యార్థులు హాజరు కావాల్సి ఉంది.

'బంగారు' చంద్రిక

పవర్‌లిఫ్టింగ్‌లో ప్రతిభ



మంగళగిరి: పట్టణంలోని ఈద్గా మైదానంలో గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ సబ్ జూనియర్, జూనియర్, సీనియర్, మాస్టర్ మెన్, ఉమెన్ బెంచ్ ప్రెస్–2024 పోటీలు శుక్రవారం ముగిశాయి. మహిళా విభాగంలో పట్టణానికి చెందిన పవర్ లిఫ్టర్ బొల్లినేని చంద్రిక రెండు బంగారు పతకాలను సాధించింది. 560 కేజీల విభాగంలో స్క్వాట్ 252.5కేజీలు, బెంచ్ ప్రెస్ 107.5 కేజీలు, డెడ్‌లిఫ్ట్ 200 కేజీల విభాగాలలో రెండు బంగారు పతకాలు సాధించిన ఆమెను అసోసియేషన్ ప్రతినిధులు కొమ్మాకుల విజయ భాస్కరావు, షేక్ సంధాని, సకల కోటేశ్వరరావు, ఎన్.సి.మోహన్, మద్దె ప్రభాకర్ తదితరులు అభినందించారు.

ఢిల్లీ ఎయిమ్స్ ఫలితాల్లో డాక్టర్ వినీతకు ఫస్ట్ ర్యాంకు



గుంటూరు మెడికల్: ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) న్యూఢిల్లీ సూపర్ స్పెషాలిటీ పీజీకి నిర్వహించిన ప్రవేశ పరీక్షకు డాక్టర్ కన్నెగంటి వినీత రుమటాలజీ విభాగంలో జాతీయ స్థాయిలో మొదటి ర్యాంకు సాధించారు. డాక్టర్ వినీత ఎయిమ్స్‌లోనే ఎంబీబీఎస్ పూర్తి చేసి జనరల్ మెడిసిన్ పీజీని ఛండీగఢ్‌లోని పోస్టు గ్రాడ్యుయేట్ ఇనిస్టిట్యూట్ మెడికల్ అండ్ రీసెర్చ్‌లో పూర్తి చేశారు.

తీరంలో ఆనంద నగర వనం

- ఆహ్లాదకరంగా అటవీ భూమి
- నగర్ వన్ యోజన పథకంతో అభివృద్ధికి శ్రీకారం
- 140 ఎకరాల్లో వసతుల కల్పన
- అభివృద్ధికి రూ. 2 కోట్ల కేటాయింపు
- ఇప్పటికే రూ. 1.40 కోట్ల మంజూరు
- అడవుల మధ్యలో 5 కి.మీ. వాకింగ్ ట్రాక్ ఏర్పాటు
- పర్యాటకుల కోసం ఓపెన్ జిమ్ సిస్టమ్
- ఇంటి వంటలను మరిపించే విధంగా రెస్టారెంట్



జామాయిల్ తోట మధ్యలో వాకింగ్ ట్రాక్

బాపట్ల టౌన్: తీర ప్రాంతంలో పచ్చని చెట్లు..సెలయేర్లు... పచ్చిక బయళ్లతో ఆహ్లాదకర వాతావరణాన్ని అందించేందుకు అటవీశాఖ సిద్ధమైంది. కాకులు దూరని కారడవి.. చీమలు దూరని చిట్టడవిని తలపించే అటవీ భూముల్ని ప్రకృతి అందాలకు నిలయంగా తీర్చిదిద్దుతున్నారు. నిత్యం పనిభారం.. మానసిక ఒత్తిడితో కొట్టుమిట్టాడే పట్టణ ప్రజలు, పర్యాటకులకు ఆహ్లాదకర వాతావరణం అందించేందుకు నగర వనం ముస్తాబవుతోంది.. సహజ సిద్ధంగా పెరిగిన నేరేడు, జామాయిల్, జీడిమామిడి చెట్ల మధ్యలో ఐదు కిలోమీటర్ల మేరా ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్ పర్యాటకుల్ని ఆకట్టుకోనుంది. బాపట్ల–సూర్యలంక మార్గంమధ్యలోని ముత్తాయపాలెం ఏ బీట్ పరిధిలోని 140 ఎకరాల్లో ముస్తాబవుతున్న నగర వనం మరో నెల రోజుల్లో (జూన్ ఆఖరి వారం)లో ప్రారంభానికి సిద్ధం కానుంది.

140 ఎకరాల్లో వనం

ఇప్పటికే పర్యాటకంగా సూర్యలంక సముద్ర తీరం ఎంతో అభివృద్ధి చెందింది. సహజ సిద్ధమైన తీరంగా రాష్ట్రంలోనే పేరు పొందింది. సూర్యలంక సముద్ర తీరం నుంచి ఆదర్శనగర్ వరకు సుమారు మూడు కిలోమీటర్ల మేరా దట్టమైన ముళ్ల చెట్లతో విస్తరించి ఉన్న అటవీ ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు ఆ శాఖ సిద్ధమైంది. ఇప్పటికే సుమారు 50 ఎకరాల్లో నేచురల్ క్యాంప్ రిసార్ట్సను ఏర్పాటుచేసిన అటవీ శాఖ మరో నాలుగు అడుగులు ముందుకేసి 140 ఎకరాల్లో నగర వనాన్ని ఏర్పాటు చేసేందుకు సిద్ధమైంది. దానిలో భాగంగా ఇప్పటికే దట్టమైన ముళ్ల చెట్లను తొలగించి సుందరమైన పచ్చిక బయళ్లు, బోటు షికారు కోసం రెండు చెరువులు, పర్యాటకులు సేద తీరేందుకు ఎకో షెడ్లు ఏర్పాటు చేస్తున్నారు. వాకింగ్ కోసం ఐదు కిలోమీటర్ల మేరా ట్రాక్, వీటితోపాటు 62.5 ఎకరాల్లో అడవి జాతి మొక్కలు పెంచేందుకు సిద్ధమవుతున్నారు.

రూ. 2 కోట్లతో అభివృద్ధి పనులు

పర్యాటకంగా అటవీ ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు నగర వన్ యోజన పథకం కింద ప్రభుత్వం రూ. 2 కోట్లు మంజూరు చేసింది. వాటిల్లో ఇప్పటికే రూ. 1.40 కోట్లు విడుదల చేసింది. వీటితో రూ. 7 లక్షలతో ఓపెన్ జిమ్, రూ. 9 లక్షలతో చిన్నారులు ఆడుకునేందుకు ఆట వస్తువులతో ప్లే గ్రౌండ్, రూ. 40 లక్షలతో 5 కి.మీ మేరా వాకింగ్ ట్రాక్, రూ. 15 లక్షలతో జీ ప్లస్ వన్ రెస్టారెంట్, రూ. 10 లక్షలతో ఆఫీస్ కార్యాలయం, రూ. 10 లక్షలతో బోట్ షకారు కోసం రెండు చెరువులు, రూ. 7 లక్షలతో రెయిన్ వాటర్ డ్రెయిన్, రూ. 10 లక్షలతో ఎకో షెడ్ షెల్టర్లు, రూ. 20 లక్షలతో 140 ఎకరాలకు ఫెన్సింగ్, రూ. 2 లక్షలతో నర్సరీ మొక్కల పెంపకం, రూ. 10 లక్షలతో డ్రిప్ విధానంలో మొక్కల పెంపకాన్ని ఇప్పటికే చేపట్టారు.

62.5 ఎకరాల్లో బ్లాక్ ప్లాంటేషన్

నగర వనానికి కేటాయించిన 140 ఎకరాల్లో 62.5 ఎకరాల్లో బ్లాక్ ప్లాంటేషన్ ఏర్పాటు చేశారు. ఇందులో అటవీ జాతి మొక్కలైన నేరేడు, మద్ది, చింత, బాహుణ్య, నెమలి నార, పొగడ, పిగ్నోనియా, కదంబ, బాదం, అడవి మామిడి, అల్ల నేరేడు, లాగిస్ట్రోమియా, స్పాథోడియా, జీడి మామిడి, సపోట, పెద్ద ఉసిరి, చిన్న ఉసిరి, సీతా అశోక, అడవి నిమ్మ, ముష్టి రకాలకు చెందిన మొక్కలు పెంచుతున్నారు. ఇప్పటకే 30 ఎకరాల్లో నాటారు. మిగిలిన ప్రాంతాల్లో నాటేందుకు నర్సరీలో మొక్కలను సిద్ధం చేస్తున్నారు.

నెల రోజుల్లో ప్రారంభిస్తాం



నగర వనం నెల రోజుల్లో ప్రారంభం కానుంది. ఇప్పటికే అన్ని వసతులు ఏర్పాటు చేశాం. గతంలో ఎన్నడూలేని విధంగా సహజ సిద్ధమైన వసతులతో కూడిన ఆహ్లాదాన్ని పర్యాటకులకు అందించనున్నాం.

– ఎల్. భీమయ్య,
జిల్లా అటవీశాఖాధికారి



నిర్మాణంలో ఉన్న రెస్టారెంట్



పర్యాటకులు సేదతీరేందుకు ఎకో షెల్టర్లు

ప్లాస్టిక్ వ్యర్థాల నివారణకే నగర వనం

పర్యాటకంగా ఎంతో అభివృద్ధి చెందిన సూర్యలంక సముద్ర తీరానికి వీకెండ్స్‌తోపాటు కార్తిక మాసం, సెలవు రోజుల్లో రాష్ట్ర నలుమూలల నుంచి పర్యాటకుల తాకిడి అధికంగా ఉంటుంది. స్నానాలు అనంతరం భోజనాలు చేసేందుకు సమీపంలోని అటవీ భూముల్లోకి వెళ్తున్నారు. దీంతో వారి వెంట తెచ్చుకున్న ప్లాస్టిక్ కవర్లు, విస్తర్లు, గ్లాసులు విచ్చలవిడిగా పారేయడంతో ఆహ్లాదకరమైన అటవీప్రాంతం అపరిశుభ్రానికి కేరాఫ్‌గా మారింది. దీంతోపాటు ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల భూసారం కోల్పోయే ప్రమాదం ఉంది. దీన్ని గ్రహించిన అటవీ శాఖ నగర వనాన్ని ఏర్పాటు చేస్తోంది. ప్రారంభమైన తర్వాత పర్యాటకులు తప్పనిసరిగా అక్కడే సేదతీరాలి. అలా కాకుండా అటవీ ప్రాంతాల్లో ఎక్కడైనా కనిపిస్తే వారిపై చర్యలు తీసుకునేందుకు ఫారెస్ట్ అధికారులు సిద్ధమవుతున్నారు.

అనుమానంతో భార్యపై హత్యాయత్నం

కత్తితో పొడిచిన భర్త



వైద్యశాలలో చికిత్స పొందుతున్న మానస

తెనాలి రూరల్: తెనాలి కొత్తపేటలోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ సహా పలు ప్రభుత్వ కార్యాలయాలకు కూతవేటు దూరంలో శుక్రవారం సాయంత్రం దారుణం జరిగింది. ఓ నోటరీ కార్యాలయంలో డీటీపీ ఆపరేటర్‌గా పని చేస్తున్న పులివర్తి మానసపై భర్త చిల్లా రవి కత్తితో విచక్షణారహితంగా దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. తీవ్ర గాయాలతో ఉన్న మానసను స్థానికులు ప్రభుత్వ జిల్లా వైద్యశాలకు తరలించగా భర్త రవిని వన్‌టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వన్‌టౌన్ సీఐ దశరథరామారావు, స్థానికుల కథనం ప్రకారం.. కొల్లూరుకు చెందిన చిల్లా రవికి వరుసకు మేనకోడలయ్యే పులివర్తి మానసతో 2017లో వివాహమైంది. వీరికి ఇప్పటి వరకూ పిల్లలు లేరు. ప్రస్తుతం రవి కూలి పనులు చేసుకుంటుండగా బీటెక్ చదివిన మానస తెనాలి కొత్తపేటలోని నోటరీ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తోంది. రవి పెళ్లయిన నాటి నుంచి మద్యం తాగుతూ అదనపు కట్నం కోసం మానసను వేధిస్తుండేవాడు. దీనిపై కొంత కాలం కిందట మానస, ఆమె తల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు కోర్టులో విచారణలో ఉంది. ప్రస్తుతం మానస తల్లి వద్దనే ఉంటూ రోజూ తెనాలి వచ్చి ఉద్యోగం చేసుకుని వెళుతోంది. శుక్రవారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో భార్య పని చేసే డీటీపీ సెంటర్ వద్దకు వచ్చిన రవి ఆమెపై కత్తితో విచక్షణా రహితంగా దాడి చేశాడు. మెడ, వీపు మీద మూడుచోట్ల పొడవడంతో మానస తీవ్రంగా గాయపడింది. స్పందించిన స్థానికులు ప్రభుత్వ జిల్లా వైద్యశాలకు తరలించారు. నిందితుడు రవిని వన్‌టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మానస పరిస్థితి నిలకడగా ఉందని, ప్రాణాపాయం తప్పిందని తెలిసింది.

భవిత కేంద్రాల్లో 'ప్రత్యేక' విద్య

- ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపునకు సర్వే
- బడిబాట పట్టేందుకు ప్రభుత్వం చర్యలు
- వేమూరు నియోజక వర్గంలో 50 మంది చిన్నారుల గుర్తింపు



జంపనిలో నిర్వహిస్తున్న సర్వేలో జిల్లా అధికారి జాహ్నవి

వేమూరు: ప్రత్యేక అవసరాల పిల్లలు ఉజ్వల భవితకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. వారిలో మార్పు తీసుకొచ్చి బడిబాట పట్టించేందుకు అనేక కార్యక్రమాలు చేపడుతోంది. సమగ్ర శిక్ష ద్వారా ప్రత్యేకంగా భవిత కేంద్రాలు ఏర్పాటు చేసింది. ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్సు పర్సన్ ద్వారా పిల్లలకు ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తోంది. అవసరమైన పిల్లలకు వారం వారం ఫిజియోథెరపీ కూడా చేయిస్తోంది.

మే ఒకటి నుంచి గ్రామాల్లో సర్వే

వేసవి సెలవులు ప్రారంభమైన తర్వాత మే ఒకటో తేదీ నుంచి ఐఈఆర్పీలు గ్రామాల్లో సర్వే చేస్తూ ప్రత్యేక అవసరాలు పిల్లల్ని గుర్తిసున్నారు.0–18 ఏళ్లలోపు ఉన్న పిల్లలు కోసం సర్వే పక్కాగా చేస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల వివరాలు ఆరా తీస్తున్నారు. వివరాలు ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు ఆన్‌లైన్ ద్వారా పంపుతున్నారు. వేమూరు నియోజక వర్గంలోని వేమూరు, కొల్లూరు, భట్టిప్రోలు, అమర్తలూరు, చుండూరు మండలాల్లో ఇప్పటి దాకా 50 మంది పిల్లల్ని గుర్తించారు.

తల్లిదండ్రులకు అవగాహన

ఇంటిలో పరిస్థితుల దృష్ట్యా కొందరు తల్లిదండ్రులు ప్రత్యేక అవసరాల పిల్లల్ని బడులకు పంపడానికి ఆసక్తి చూపడం లేదు. అటువంటి వారికి ఐఈఆర్పీలు అవగాహన కల్పిస్తున్నారు. చదువు వల్ల కలిగే ప్రయోజనాలు, బడులకు పంపితే పిల్లల్లో కలిగే మార్పులు వివరిస్తున్నారు. ప్రభుత్వ రాయితీలు, సదుపాయాల్ని తెలియజేస్తున్నారు. పిల్లల్ని అంగన్‌వాడీ స్కూళ్లు, ప్రాథమిక , ప్రాథమికోన్నత ఉన్నత పాఠశాలలు, భవిత కేంద్రాల్లో చేర్పించాలా చర్యలు తీసుకుంటున్నారు.

సదుపాయాలు, అలవెన్స్‌లు మంజూరు

- ప్రత్యేక అవసరాల పిల్లలకు ప్రభుత్వం నాలుగు రకాల అలవెన్సులు అందజేస్తోంది.
- బడికి వచ్చే మానసిక, బుద్ధి మాంద్యం పిల్లలకు, ఇంటి వద్ద ఉంటున్న వారికి, బాలికలకు ప్రత్యేక అలవెన్సులు ఇస్తోంది.
- బడికొచ్చే పిల్లలకు రీడర్ అలవెన్స్ కింద నెలకు రూ 200 చొప్పన పది నెలలకోసారి రూ 2 వేలు అందజేస్తోంది.
- ఎస్కార్ట్ అలవెన్స్ కింద నెలకు రూ. 300 చొప్పన 10 నెలలకు రూ. 3 వేలు ఇస్తోంది.
- బాలికలకు గర్ల్ చైల్డ్ అలవెన్స్ కింద నెలకు రూ. 200 ప్రకారం 10 నెలలకు రూ. 2 వేలు ఇస్తోంది.
- బడికి రాని పిల్లలకు హోం అలవెన్స్ కింద నెలకు రూ. 300 ప్రకారం పది నెలలకు రూ 3 వేలు ఇస్తోంది.
- బడికి వెళ్తున్న వారికి ఇతర విద్యార్థులతో పాటు యూనిఫాం, పాఠ్య పుస్తకాలు, షూ, టై అందజేస్తోంది.
- అమ్మ ఒడి పథకంతో పాటు దివ్యాంగ చిన్నారులకు విద్యను డిజిటలైజేషన్ చేసి ట్యాబ్‌లు కూడా అందజేస్తోంది.

ముమ్మరంగా సర్వే



నియోజక వర్గంలో 18 ఏళ్లలోపు ప్రత్యేక పిల్లలను గుర్తించేందుకు సర్వే ముమ్మరంగా సాగుతోంది. ఐఈఆర్పీలంతా గ్రామాలోకి వెళ్లి ప్రత్యేక అవసరాలు పిల్లల తల్లిదండ్రులను కలిసి వారికి విద్య ఆవశ్యకతపై అవగాహన కల్పిస్తున్నారు. పిల్లలను భవిత పాఠశాలల్లో చేర్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

– తూమాటి ధనరాజు,
ఐఈఆర్పీ, కొల్లూరు

పొగాకు పరిశ్రమల నుంచి పిల్లలను రక్షించుకుందాం

డీఎంఅండ్‌హెచ్‌ఓ విజయమ్మ



ప్రదర్శన ప్రారంభిస్తున్న విజయమ్మ

బాపట్ల: పొగాకు పరిశ్రమల నుంచి పిల్లల్ని రక్షించుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టరు విజయమ్మ సూచించారు. జాతీయ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శుక్రవారం వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టరు విజయమ్మ మాట్లాడుతూ పొగాకు వినియోగానికి వ్యతిరేకంగా వ్యూహాత్మక కార్యాచరణను ప్రకటించాలని సూచించారు. గ్రామాల్లోని ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టరు రమాదేవి, డీఐఓ టి.వెంకటేశ్వర్లు, సౌజన్య పాల్గొన్నారు.

నిఘా నేత్రంలో బాపట్ల జిల్లా

- కౌంటింగ్ రోజు జిల్లాలో ఐదు డ్రోన్లతో పటిష్ట నిఘా
- జూన్ 3 నుంచి 144 సెక్షన్ కఠినంగా అమలు
- బాపట్ల, చీరాల, అద్దంకి, రేపల్లె ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి
- కౌంటింగ్ కేంద్రాల్లోకి అభ్యర్థులు, ఏజెంట్లకే అనుమతి
- చెక్‌పోస్ట్‌ల వద్ద ప్రతివాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలి
- ప్రతి ఒక్క అధికారి అప్రమత్తంగా వ్యవహరించాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ

బాపట్ల టౌన్: ఎన్నికల కౌంటింగ్ ప్రారంభమైనప్పటి నుంచి ముగిసేంతవరకు జిల్లా మొత్తం నిఘా నేత్రంలో ఉంటుందని ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. జిల్లాలోని పోలీస్ అధికారులతో శుక్రవారం కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ జూన్ 3 సాయంత్రం నుంచి జిల్లాలో 144 సెక్షన్ కఠినంగా అమలుపరచాలని ఆదేశించారు. చీరాల, బాపట్ల, రేపల్లె, అద్దంకి నియోజకవర్గాల్లో జూన్ 3 సాయంత్రం నుంచి కౌంటింగ్ ప్రక్రియ ముగిసేంతవరకు దుకాణాలు, హోటళ్లు ఇతర వ్యాపార సముదాయాలు తెరవడానికి వీల్లేదని తెలిపారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఇప్పటివరకు సమర్థంగా విధులు నిర్వహించగలిగామన్నారు. అక్కడక్కడా చిన్నచిన్న ఘర్షణలు చెలరేగినప్పటికీ వాటిని కట్టడి చేశామని తెలిపారు. కౌంటింగ్ రోజు ఎవరైనా ఘర్షణలకు పాల్పడే అవకాశం ఉంటే వారిని గుర్తించి వెంటనే బైండవర్ చేయాలని చెప్పారు. రాజకీయ పార్టీల అభ్యర్థుల ఇంటివద్ద, పార్టీ కార్యాలయాల వద్ద కంచె, బారికేడ్లు, స్టాపర్స్ ఏర్పాటు చేసి కార్యకర్తలు, ప్రజలు రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. జూన్ 1 నుంచి 5వ తేదీ వరకు హోటళ్లు, లాడ్జీలు, రిసార్ట్లను తరచూ తనిఖీ చేయాలని, వాటిల్లో బస చేసే వారి వివరాలను తెలుసుకోవాలని ఆదేశించారు. రిసార్ట్స్‌ల్లో గతంలో నేరాలకు పాల్పడిన వారు ఎవరైనా ఉంటే వారిపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. జూన్ 1 నుంచి జిల్లాలో షాడో పార్టీలను ఏర్పాటు చేయాలని చెప్పారు. వీరు రాజకీయ పార్టీల అభ్యర్థుల్ని ఎప్పటికప్పుడు అనుసరిస్తూ ఒకే సమయంలో రెండు పార్టీల అభ్యర్థులు ఎదురుపడే అవకాశం ఉన్న వెంటనే సంబంధిత స్టేషన్ ఎస్ఐకు సమాచారం అందించాలని సూచించారు. ఎన్నికల కౌంటింగ్ ఏజెంట్లతో డీఎస్పీలు సమావేశాలు నిర్వహించి, కౌంటింగ్ రోజు వారు ఎలా వ్యవహరించాలి, చట్టాన్ని అతిక్రమిస్తే తీసుకునే చర్యల గురించి అవగాహన కల్పించాలని తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగే వ్యక్తులు గొడవలు పడే అవకాశం ఉంటుందని, వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమస్యాత్మక ప్రాంతాలు, గ్రామాల్ని పోలీస్ అధికారులు తరచూ సందర్శించాలని చెప్పారు. ఆయా ప్రాంతాల్లో పికెట్లను ఏర్పాటు చేయాలని, పెట్రోలింగ్ నిర్వహిస్తూ ఉండాలన్నారు. చీరాల, బాపట్ల మార్గాల్లో ఉన్న చెక్‌పోస్టుల వద్ద ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సూచించారు. రాళ్లు, ఇనుప రాడ్లు, కర్రలు ఇతర వస్తువులు, మారణాయుధాలు ఉంటే ఆ వాహనాన్ని సీజ్ చేసి పై అధికారులకు సమాచారం అందించాలని తెలిపారు. పోలీస్ సిబ్బంది లాఠీ, హెల్మెట్ తప్పనిసరిగా దగ్గర ఉంచుకోవాలని చెప్పారు. నాకాబందీ నిర్వహించి సీజ్ చేయబడిన వాహనాలను మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ చెక్ చేసి ఆర్డర్ ఇచ్చిన తర్వాత మాత్రమే రిలీజ్ చేయాలని పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం ఐదు డ్రోన్‌లతో నిఘా ఏర్పాటు చేస్తున్నామని, చీరాల, బాపట్ల, అద్దంకి, రేపల్లె ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. ఘర్షణ ప్రాంతాల్లో డ్రోన్లను ఎగురవేసి వాటి సహాయంతో నిందితుల్ని గుర్తించి, వారిపై కేసులు నమోదు చేసి అరెస్ట్ చేయాలని ఆదేశించారు. కౌంటింగ్ కేంద్రాలకు వచ్చే ఏజెంట్లు వద్ద సంబంధిత అధికారుల నుంచి జారీ చేయబడిన గుర్తింపు కార్డు, ఫామ్ 18 తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు. కౌంటింగ్ కేంద్రంలో అభ్యర్థులు, ఏజెంట్లు ఘర్షణలకు పాల్పడినా, ఇతరులను రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేసినా కేసులు నమోదు చేసి రౌడీషీట్ తెరుస్తామని తెలిపారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్, చీరాల డీఎస్పీ బి.ప్రసాద్, రేపల్లె డీఎస్పీ టి మురళీకృష్ణ, జిల్లాలోని సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్‌లో సత్తా చాటిన నంద



సంతమాగులూరు (అద్దంకి రూరల్): సంతమాగులూరు మండలం ఏల్చూరు గ్రామానికి చెందిన పలుచూరి కుమారి నంద పవర్ లిఫ్టింగ్‌లో పతకాలు సాధించింది. ఈనెల మంగళగిరిలో 29 నుంచి 31 వరకు జరిగిన 11వ స్టేట్ పవర్ లిఫ్టింగ్, బెంచ్ ప్రెస్ చాంపియన్‌షిప్‌లో ఆమె తలపడింది. 76 కేజీల విభాగంలో రెండు సిల్వర్ పతకాలు సాధించింది. ఈ సందర్భంగా ఆమెను గ్రామస్తులు అభినందించారు.

నిప్పుల కొలిమిగా చీరాల



చీరాలలో నిర్మానుష్యంగా ఉన్న రోడ్డు

- 43 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
- నిర్మానుష్యంగా రహదారులు

చీరాల: సూరీడు సుర్రుమంటున్నాడు. ఎప్పుడూ లేని విధంగా ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో చీరాల ప్రజలు అల్లాడిపోతున్నారు. గత కొద్దిరోజులుగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో ఉక్కపోత ఎక్కువైంది. బయటకు అడుగు పెట్టాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. గత మూడు రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల పైన నమోదు కావడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. శుక్రవారం తీవ్రస్థాయిలో 43 డిగ్రీలు నమోదు కావడంతో ఫ్రైడే కాస్త ఫ్రైడేగా మారింది. చీరాలలో అధిక స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ఉదయం 10 గంటలకే రోడ్లపై జనం కనిపించడం లేదు. ఇంటికే పరిమితమవుతున్నారు. ఉక్కపోతను తట్టుకోవడానికి ఏసీలను కూడా ఎక్కువగా వినియోగిస్తున్నారు. జూన్ 3వ తేదీ వరకు పగటి ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదు అవుతాయని, అత్యవసరమైతే తప్పా బయటకు రావద్దని వాతావరణ శాఖ కూడా హెచ్చరికలు జారీ చేసింది. ప్రజలు కూడా హెచ్చరికలను పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు.

క్లుప్తంగా

చికిత్స పొందుతూ మాజీ సైనికుడి మృతి

బాపట్ల టౌన్: చికిత్స పొందుతూ మాజీ సైనికుడు మృతి చెందిన సంఘటన మండలంలోని బేతపూడిలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మాజీ సైనికుడు కావూరి సుబ్రహ్మణ్యంరెడ్డి ఇటీవల చీరాల సమీపంలో హైవేపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. గుంటూరులోని లలితా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. ఆయన భౌతిక కాయానికి శుక్రవారం సైనిక సంక్షేమ సంఘం సభ్యులు జాతీయ జెండాను కప్పి పూలమాలలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉమ్మడి గుంటూరు జిల్లా కోఆర్డినేషన్ కమిటీ అధ్యక్షుడు సుంకర శేషగిరిరావు, బాపట్ల మాజీ సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు తాండ్ర సాంబశివరావు, సీనియర్ మాజీ సైనికులు డి. వెంకటేశ్వర్లు, సీహెచ్‌వి. కృష్ణారావు, భక్కా రామకృష్ణారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, పోతురాజు రెడ్డి, వెంకట కృష్ణారెడ్డి, నంగు రాంప్రసాద్‌రెడ్డి, విజయ్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, శేషురెడ్డి పాల్గొన్నారు.

లారీ డ్రైవర్ ఆకస్మిక మరణం


కల్యాణ్ సింగ్ (ఫైల్)

మార్టూరు: ఎక్కడో పుట్టి మార్టూరుకు చేరుకున్న ఓ వ్యక్తి నిద్రలోనే తిరిగిరాని శాశ్వత లోకాలకు చేరుకున్న విషాదకర ఘటన శుక్రవారం ఉదయం వెలుగు చూసింది. ఏఎస్‌ఐ మెహబూబ్ బాషా వివరాల మేరకు.. గుంటూరుకు చెందిన జంగా శ్రీనివాసరెడ్డికి చెందిన లారీపై ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రం లలిత్‌పూర్ జిల్లా చిట్వాస్ గ్రామానికి చెందిన కల్యాణ్ సింగ్ (40) గత మూడేళ్లుగా డ్రైవరుగా పని చేస్తున్నాడు. ఆగ్రా నుంచి బంగాళాదుంపల లోడుతో మార్టూరు కూరగాయల మార్కెట్‌కు గురువారం అర్ధరాత్రి 1.30 గంటల ప్రాంతంలో వచ్చాడు. అనంతరం కల్యాణ్‌సింగ్ లారీని అన్‌లోడ్‌కు ఉంచి మార్కెట్‌లోనే నిద్రకు ఉపక్రమించాడు. శుక్రవారం ఉదయం 7 గంటలకు అన్‌లోడ్ అయిన తరువాత లారీ క్లీనర్ మాన్‌బంద్ డ్రైవర్ కల్యాణ్ సింగ్‌ను నిద్ర లేపే ప్రయత్నం చేశాడు. అచేతనంగా పడిఉన్న అతడ్ని గమనించిన మాన్‌బంద్ స్థానికులతో పాటు లారీ ఓనర్ శ్రీనివాసరెడ్డికి ఫోన్ చేసి సమాచారం అందించారు. గుంటూరు నుంచి వచ్చిన లారీ యజమాని శ్రీనివాసరెడ్డి ఇచ్చిన సమాచారంతో ఏఎస్‌ఐ మార్కెట్‌కు చేరుకుని కల్యాణ్‌సింగ్‌ను గమనించారు. అతను నిద్రలోనే మరణించినట్లు గుర్తించి మృతదేహాన్ని మార్టూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతికి గుండె పోటుకు కారణం కావచ్చని ప్రాథమికంగా వైద్యులు, పోలీసులు భావిస్తున్నారు. లారీ యజమాని శ్రీనివాసరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కౌంటింగ్ విధుల్లో అశ్రద్ధ వద్దు

డీఆర్వో సత్తిబాబు


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా రెవెన్యూ అధికారి సత్తిబాబు

బాపట్ల: ఓట్ల కౌంటింగ్ విధుల్లో అశ్రద్ధ వద్దని, ప్రతి ఒక్కరూ సమర్థతతో పని చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్. సత్తిబాబు తెలిపారు. సిబ్బందికి శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో శిక్షణ ఇచ్చారు. ఓట్ల లెక్కింపులో అవాంతరాలు, పొరపాట్లు జరగకుండా అధికారులు పర్యవేక్షించాలని జిల్లా రెవెన్యూ అధికారి చెప్పారు. అధికారులు, సిబ్బందికి కేటాయించిన విధుల్ని బాధ్యతతో నిర్వర్తించాలని ఆయన సూచించారు. క్రమశిక్షణతో మెలగాలని చెప్పారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల్ని అనుసరిస్తూ ఆర్వోల సూచనలు పాటించాలని తెలిపారు.

మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు లోపలికి అనుమతించేది లేదని ఆయన స్పష్టం చేశారు. ఆర్వోలు ధ్రువీకరించిన తర్వాతే ఓట్ల లెక్కింపు వివరాలను మీడియాకు ప్రకటించాలని ఆయన తెలిపారు. విధుల్లో ఉన్నవారంతా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అధికారులు, సిబ్బంది విధి విధానాలపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో లక్ష్మీకుమారి, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు సీతారామయ్య, డీపీఆర్వో సహాయ సంచాలకురాలు కె.సుభాషిణి, ఏపీఎంఐపీ పీడీ వెంకటరమణ, ఏ-సెక్షన్ పర్యవేక్షకులు పాల్గొన్నారు.

శింగరకొండ ఆలయంలో అధునాతన వంటశాల ప్రారంభం

స్టీమ్ పరికరాలు అందించిన ఎస్‌బీఐ


వంటశాలను ప్రారంభిస్తున్న స్టేట్ బ్యాంకు జనరల్ మేనేజర్ సుగుణేశ్వరరావు

అద్దంకి: జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి భోజనశాల ఆధునికతను సంతరించుకుంది. సీఎస్సార్ యాక్టివిటీ కింద అద్దంకి స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ స్టీమ్ పరికరాలు అందజేసింది. ఆధునిక వంటశాలను శుక్రవారం స్టేట్ బ్యాంకు రీజినల్ మేనేజర్ సుగుణేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వాహణాధికారి టి. సుభద్ర మాట్లాడుతూ దేవదాయశాఖ ఆదేశాల మేరకు ప్రస్తుతం శింగరకొండలో శని, మంగళవారాల్లో రోజుకు 500 మందికి, విడి రోజుల్లో 150 నుంచి 200 మంది భక్తులకు అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్‌లో ఎక్కువ మందికి చేయాల్సి వస్తే ఈ స్టీమ్ కుక్కర్లు బాగా ఉపయోగపడతాయని చెప్పారు. ఎస్‌బీఐ అందజేసిన ఐదు కుక్కర్లలో ఒక్కో దానిలో 25 కిలోల బియ్యం 15 నుంచి 20 నిముషాల్లో అన్నంగా తయారవుతుందని వివరించారు. మూడు కుక్కర్ల సాయంతో 75 కిలోల బియ్యాన్ని అన్నంగా తయారు చేసుకోవచ్చని తెలిపారు. మిగిలిన రెండింటినీ కూరలు తయారు చేసుకోవడానికి వినియోగించనున్నట్లు ఆయన వెల్లడించారు. 20 నిముషాల్లో 500 మందికి అన్నదానం చేయగలిగిన కిచెన్ పరికరాలను అడగ్గానే అందజేసిన స్టేట్‌బ్యాంకు యాజమాన్యానికి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో బ్యాంకు అధికారులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

భార్య మృతి కేసులో భర్తకు జైలు

నరసరావుపేటటౌన్: భార్య ఆత్మహత్యకు కారణమైన భర్తకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.5,500 జరిమానా విధిస్తూ ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి ఏ.పూర్ణిమ శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ ప్రకారం.. ఫిరంగిపురానికి చెందిన షేక్ ముబినాతో అదే గ్రామానికి చెందిన షేక్ గౌస్‌కు 2007 ఏప్రిల్ 29న వివాహం అయ్యింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. చెడు వ్యసనాలకు బానిసైన భర్త అదనపు కట్నం కోసం భార్యను వేధింపులకు గురిచేశాడు. ఈ క్రమంలో 2019 నవంబర్ 10న ముబినా ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. తన సోదరి మృతికి భర్త వేధింపులే కారణమని మృతురాలి అన్న ఇచ్చిన ఫిర్యాదు ఫిరంగిపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో అభియోగ పత్రం దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు.

హనుమజ్జయంతి ఉత్సవాలు ప్రారంభం

అమరావతి: హనుమత్ జయంతి వేడుకలలో భాగంగా శుక్రవారం తొలిరోజు మండల పరిధి లోని మల్లాది ధ్యానాంజనేయస్వామి ఆలయంలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త భవిరిశెట్టి హనుమంతరావు ఆధ్వర్యంలో అర్చకుడు పరుచూరి వెంకటరమణాచార్యులు తొలుత 40 అడుగుల అభయాంజనేయస్వామి వారికి పంచామృత స్నపన, ప్రత్యేక తమలపాకుల పూజ నిర్వహించారు. అనంతరం ధ్యానాంజనేయస్వామి వారికి మన్యుసూక్తయుత పంచామృత స్నపన, సహస్ర నామాలతోను, తమలపాకులతో ఆకుపూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త బి.హనుమంతరావు మాట్లాడుతూ శనివారం ఉదయం ప్రత్యేక పూజల అనంతరం 9గంటలకు విశేషాలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పిస్తామని తెలిపారు.

రైతు వేషంలో వెళ్లి గుట్టురట్టు

విత్తన దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు


తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ ఏఓ, సీఐ తదితరులు

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): పత్తి, మిర్చి విత్తనాలను అక్రమంగా నిల్వ చేసి, కృత్రిమ కొరత సృష్టిస్తున్న దుకాణాలపై విజిలెన్స్ అధికారులు కొరడా ఝుళిపించారు. రైతు వేషంలో హెడ్‌కానిస్టేబుల్‌ను పంపి గుట్టురట్టు చేశారు. గుంటూరు రీజినల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగపు ఎస్పీ కె.ఈశ్వరరావు ఆదేశాల మేరకు గుంటూరు రాజాగారితోటలోని కుబేరా సీడ్స్- పెస్టిసైడ్స్ దుకాణానికి హెడ్ కానిస్టేబుల్ పోలిరాజును రైతు వేషంలో విజిలెన్స్ అధికారులు పంపించారు. పత్తి, మిర్చి విత్తనాలైన సూపర్ బంటి, రేవంత్, యూఎస్ 7067 రకాలున్నాయా అని పోలిరాజు అడగ్గా, నిల్వల్లేవని దుకాణ యజమాని బదులిచ్చారు. దీంతో విజిలెన్స్ ఏఓ రమణ కుమార్, సీఐ శ్రీనివాసులరెడ్డి, స్థానిక ఏఓ అంజిరెడ్డి సిబ్బంది దుకాణంలో తనిఖీలు చేపట్టారు. స్టాక్ రిజిస్టర్ పరిశీలించగా, ఆ మూడు రకాలు నిల్వల్లేవని నమోదు చేశారు. అయితే, గిడ్డంగిలో మాత్రం రేవంత్ రకం విత్తనాలు 18 సంచులను అధికారులు గుర్తించారు. దుకాణదారుడు విత్తనాలు నిల్వ చేసి, కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. రూ.15 వేలు విలువ చేసే విత్తనాలు సీజ్ చేశారు. దుకాణదారుడిపై 6-ఏ కేసు నమోదు చేయాలని స్థానిక ఏఓను ఆదేశించారు. బాలాజీ సీడ్స్ దుకాణంలో సోర్సు ధ్రువీకరణ పత్రం లేకుండా రూ.37 వేలు ఖరీదు చేసే హైబ్రిడ్ మిరప విత్తనాలను గుర్తించారు. దీంతో విత్తనాల అమ్మకాలను నిలుపుదల చేశారు. శ్రీరామా సీడ్స్ దుకాణంలో సోర్సు ధ్రువీకరణ పత్రం లేకుండా విక్రయిస్తున్న రూ.1.63 లక్షల విలువ చేసే 200 సంచుల హైబ్రిడ్ మిరప విత్తనాలకు 'స్టాప్ సేల్' నోటీసులు జారీచేశారు.

గ్రంథాలయాలకు పూర్వ వైభవం

ఉమ్మడి ప్రకాశం జిల్లా సెక్రటరీ ఆదిలక్ష్మి


రికార్డులు పరిశీలిస్తున్న ఆదిలక్ష్మి

బల్లికురవ: ప్రభుత్వ సహకారంతో గ్రంథాలయాలకు పూర్వవైభవంతో పాఠకులు నిత్యం అక్కున చేర్చుకునేలా మార్పులు చేస్తున్నామని ఉమ్మడి ప్రకాశం జిల్లా గ్రంథాలయ సంస్థ సెక్రటరీ కాసు ఆదిలక్ష్మి అన్నారు. శుక్రవారం బల్లికురవలోని శాఖా గ్రంథాలయాన్ని ఆమె తనిఖీ చేసిన అనంతరం విలేకర్లతో మాట్లాడారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 66 శాఖా గ్రంథాలయాలు, నాలుగు గ్రామీణ గ్రంథాలయాలు, 105 బుక్ డిపాజిట్లు కేంద్రాల ద్వారా పాఠకులకు సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. ఇందులో 30 గ్రంథాలయాలకు సొంత భవనాలు, 21 ఉచిత భవనాలు, 15 అద్దె భవనాల్లో నడుస్తున్నాయని చెప్పారు. వీటిలో 37 మంది గ్రంథపాలకులు, రెగ్యులర్, 11 మంది ఔట్ సోర్సింగ్ ద్వారా ఎంపిక చేసిన వారు పనిచేస్తున్నారని చెప్పారు. ఖాళీల భర్తీ కోసం జిల్లా కలెక్టర్‌కు నివేదించగా ఎస్సీ, ఎస్సీ బ్యాక్‌లాగ్‌లో మెరిట్‌లో ఉన్న ఇద్దరిని ఎంపిక చేసి, త్రిపురాంతకం, పొదిలి గ్రంథాలయాలకు లైబ్రేరియన్లుగా నియమించామని చెప్పారు. ప్రతి గ్రంథాలయానికి స్వీపరును నియమించి జీతాన్ని రూ.2500కు పెంచినట్లు చెప్పారు. ప్రభుత్వం విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన వేసవి విజ్ఞాన శిబిరాలను ఉపయోగించుకుంటూ పోటీల్లో ప్రతిభ చూపుతున్నట్లు వివరించారు.

గ్రంథాలయాన్ని అభివృద్ధి పరచండి

బల్లికురవలో గ్రంథాలయ భవనం పెచ్చులు ఊడుతోందని, అభివృద్ధి చేసి రెగ్యులర్ గ్రంథపాలకుడి నియమించాలని స్థానికులు సెక్రటరీకి విన్నవించారు. పోస్టు భర్తీ చేసేలోపు తాత్కాలికంగా అద్దంకి లైబ్రరియన్ చుండూరు సుగుణరావు వారంలో శనివారం ఇక్కడ విధులు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. మిగిలిన రోజుల్లో ఇక్కడ పనిచేసే స్వీపరే వారపత్రికలు, దినపత్రికలు పాఠకులకు అందుబాటులో ఉండే విధంగా చూస్తాడని చెప్పారు. భవన మరమ్మతులకు అంచనాలు తయారు చేయిస్తామని ఆదిలక్ష్మి చెప్పారు.

ముగిసిన ఖోఖో వేసవి శిక్షణ శిబిరం


శిక్షణ పొందిన క్రీడాకారులతో గ్రామస్తులు, అధికారులు

జే.పంగులూరు: ఉమ్మడి ప్రకాశం జిల్లా ఖోఖో వేసవి శిక్షణ శిబిరం శుక్రవారంతో ముగిసింది. మండల పరిధిలోని పంగులూరు మాగుంట సుబ్బరామిరెడ్డి, బాచిన నారాయణమ్మ జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో నెల రోజుల నుంచి స్పోర్ట్ అథారిటీ ఆంధ్రప్రదేశ్ అనుమతితో, ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమీ ఆధ్వర్యంలో పురుషుల ఖోఖో శిక్షణ శిబిరం నిర్వహించారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా నుంచి సుమారు 75 మంది బాలురు, పురుషులు పాల్గొన్నారు. ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమీ, గ్రామస్తులు, పూర్వ విద్యార్థుల సహకారంతో రూ.1.50 లక్షల వ్యయంతో శిబిరం నిర్వహిచినట్లు ఖోఖో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి మేకల సీతారామిరెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న పంగులూరు ఎస్‌బీఐ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసరావు క్రీడాకారులు ఉద్దేశించి మాట్లాడారు. వేసవిలో సమయాన్ని వృథా చేయక బాలురకు, శిక్షణకు పంపిన తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు.

శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

బాపట్ల జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి కె. పాల్‌కుమార్ మాట్లాడుతూ పంగులూరు అంటేనే ఖోఖో క్రీడ గుర్తుకు వస్తుందన్నారు. 252 క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. శిక్షణకు పూర్వ క్రీడాకారులు బొప్పూడి హరిబాబు (యూఎస్ఏ), ఐ. సోమశేఖర్‌రెడ్డి (గ్రామ సచివాలయం), శ్రీనివాసరెడ్డి (పీఈటీ), మేకా వెంకటేశ్వర్లు (పీఈటీ), కుక్కపల్లి వెంకట్రావు (సీఐ) రూ. 25 వేలు ఆర్థిక సాయం చేశారు. మిగిలిన ఖర్చులు ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమీ అందించినట్లు తెలిపారు. ఎస్ఆర్ స్పోర్ట్స్ తరఫున 45 మందికి క్రీడా దుస్తుల్ని నల్లమపు శ్రీరాములురెడ్డి జ్ఞాపకార్థం వారి కుమార్తె ఉషారాణి (అడ్వకేట్) బహూకరించారు. వారికి క్రీడాకారులు కృతజ్ఞులు తెలిపారు. క్రీడాకారులకు బాపట్ల కోచ్ జొన్నలగడ్డ పాల్ (డీఎస్ఏ) శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో పంగులూరు కళాశాల మాజీ అంతర్జాతీయ క్రీడాకారుడు భవనం కాశీవిశ్వనాథరెడ్డి, గ్రామ సర్పంచ్ గుడిపూడి నాగేంద్రం, రామారావు, జెడ్పీటీసీ సభ్యురాలు రాయిణి ప్రమీల, వెంకట సుబ్బారావు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఆంధ్ర సెంట్రల్ జోన్ క్రికెట్ పోటీలు ప్రారంభం

- అండర్-19 బాలుర క్రికెట్ పోటీలు
- కృష్ణా జట్టు శుభారంభం
- సెంచరీలతో చెలరేగిన కృష్ణా బ్యాట్స్‌మెన్‌లు


శ్రీనిశ్చయ్ 127 పరుగులు


వరుణ్‌సాత్విక్ 108 పరుగులు

నరసరావుపేటఈస్ట్: ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) ఆధ్వర్యంలో ఆంధ్ర సెంట్రల్ జోన్ అంతర్ జిల్లాల అండర్-19 బాలుర క్రికెట్ పోటీలు శుక్రవారం ఏసీఏ, ఎస్‌కెఆర్‌బీఆర్ క్రికెట్ మైదానంలో ప్రారంభమయ్యాయి. తొలి మ్యాచ్‌లో కృష్ణా, ప్రకాశం జిల్లాల జట్లు తలపడగా కృష్ణా జట్టు 206 పరుగుల భారీ తేడాతో ప్రకాశం జిల్లా జట్టుపై ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ చేపట్టిన కృష్ణా జట్టు నిర్ణీత 50 ఓవర్లలో ఐదు వికెట్లు నష్టానికి 385 పరుగుల భారీ స్కోర్ సాధించింది. కృష్ణా జట్టు బ్యాట్స్‌మెన్‌లు శ్రీనిశ్చయ్ 91 బంతుల్లో 127, వరణ్‌సాత్విక్ 68 బంతుల్లో 108 పరుగులతో సెంచరీలు సాధించారు. మరో బ్యాట్స్‌మెన్ ఖాజా మొహిద్దీన్ 99 పరుగుల వద్ద పెవిలియన్ బాట పట్టి సెంచరీ చేజార్చుకున్నాడు. ప్రకాశం జట్టు బౌలర్ జయంత్‌కు మూడు వికెట్లు లభించాయి. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ప్రకాశం జట్టు ఏ దశలోనూ లక్ష్య సాధన దిశగా పరుగులు సాధించలేక 179 పరుగులకే కుప్పకూలింది. ప్రకాశం బ్యాట్స్‌మెన్‌లు రిలాస రెడ్డి 40, ఎస్.అఖిల్ 39 పరుగులు సాధించారు. కృష్ణా జట్టులోని బి.గీత్ 4, వరుణ్‌సాత్విక్ రెండు వికెట్లు సాధించారు. మ్యాచ్‌ను ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ సభ్యుడు కె.వి.పురుషోత్తమరావు, గ్రౌండ్ అడ్మినిస్ట్రేటర్ ఎన్.సీతాపతిరావు పర్యవేక్షించారు.

ఏపీ ఈసెట్‌లో విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులతో చెరువు రామకృష్ణమూర్తి, ఐజాక్ ప్రసాద్, సుబ్బరావు, నర్సిరెడ్డి

గుంటూరు ఎడ్యుకేషన్: పాలిటెక్నిక్ విద్యార్హతతో బీటెక్‌లోకి ప్రవేశం కల్పించే ఏపీ ఈసెట్ ఫలితాల్లో హిందూ ఇంజినీరింగ్ కళాశాల పాలిటెక్నిక్ బ్రాంచ్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపారని కళాశాల కరస్పాండెంట్ చెరువు రామకృష్ణమూర్తి తెలిపారు. శుక్రవారం అమరావతిరోడ్డులోని కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో రామకృష్ణమూర్తి మాట్లాడుతూ తమ విద్యార్థులు సీఎస్ఈ విభాగంలో పి.కార్తికేయ రాష్ట్రస్థాయిలో 77వ ర్యాంకు, పోట్ల అక్షయ శ్రీ 194వ ర్యాంకు, మిర్యాల దీప్తిక 218వ ర్యాంకు, ఈసీఈ విభాగంలో కె. భావన 1006వ ర్యాంకు సాధించినట్లు వివరించారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో పాలిటెక్నిక్ విభాగం నుంచి 85 మంది విద్యార్థులు ఈసెట్‌కు హాజరు కాగా, వారిలో 83 మంది ర్యాంకులు కైవసం చేసుకోవగం గొప్ప విషయమన్నారు. వచ్చే విద్యాసంవత్సరంలో మరింత మెరుగైన ఫలితాల కోసం కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ పి. ఐజాక్ ప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ చిన్నం సుబ్బారావు, వైస్ ప్రిన్సిపాల్ వజ్రాల నర్సిరెడ్డి, విభాగాధిపతులు వి. రమాదేవి, చల్లా జ్యోతిర్మయి పాల్గొన్నారు.

రంగస్థల నటుడు కృష్ణేశ్వరరావుకు సత్కారం


కృష్ణేశ్వరరావుని సత్కరిస్తున్న అతిథులు

నగరంపాలెం (గుంటూరు వెస్ట్): స్థానిక బృందావన్ గార్డెన్స్ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై అక్కిరాజు ఆర్ట్స్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రముఖ రంగస్థల సినీ నటుడు వై.ఎస్.కృష్ణేశ్వరరావును సత్కరించారు. రచయిత, నాటకరంగ పరిశోధకుడు డాక్టర్ కందిమళ్ళ సాంబశివరావు అధ్యక్షత వహించారు. అప్పాజోస్యుల విష్ణుభొట్ల ఫౌండేషన్ స్థాపకుడు అప్పాజోస్యుల సత్యనారాయణ, సనాతన ధర్మ ప్రచారకులు యాబలూరి లోకనాథశర్మ, సంస్థ అధ్యక్షులు డాక్టర్ అక్కిరాజు సుందర రామకృష్ణ, కార్యదర్శి పంద్రప్రగడ శ్రీనివాస్, ఆలయ కమిటీ అధ్యక్ష్య కార్యదర్శులు సీహెచ్.మస్తాన య్య, బొర్రా ఉమామహేశ్వరరావు, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, కోశాధికారి లంకా సూర్యనారాయణ, ప్రముఖ రంగస్థల నటుడు కావూరి సత్యనారాయణ పాల్గొన్నారు. అనంతరం సంస్థ అధ్యక్షుడు సుందరరామకృష్ణ భక్తి చింతామణి నాటకంలో బిల్వమంగళుడు ఏకపాత్రాభినయం చేసి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. వయోలిన్‌పై పాణ్యం దక్షిణామూర్తి సంగీత సహకారం అందించారు.

యూనియన్ బ్యాంకు నుంచి విదేశీ విద్యా రుణాలు


రుణ పత్రాలు అందుకున్న విద్యారులతో యూనియన్ బ్యాంకు అధికారులు, సిబ్బంది

కొరిటెపాడు: గుంటూరు యూనియన్ బ్యాంకు ప్రాంతీయ కార్యాలయంలో శుక్రవారం విద్యార్థులకు విదేశీ విద్యా రుణ మంజూరు పత్రాలను బ్యాంకు అధికారులు అందించారు. కార్యక్రమంలో బ్యాంకు రీజినల్ హెడ్ ఎస్.జవర్ మాట్లాడుతూ రూ. 40 లక్షల వరకు ఎటువంటి సెక్యూరిటీ అవసరం లేకుండా విదేశీ విద్యా రుణాలు మంజూరు చేస్తున్నట్టు వివరించారు. అంతర్జాతీయంగా ప్రసిద్ధి పొందిన యూనివర్సిటీల్లో చదివే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, వారికి యూనియన్ బ్యాంకు ఎల్లప్పుడూ సహకారాన్ని అందిస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ రీజినల్ హెడ్‌లు అశ్వత్థనాయక్, ఎ.రాజేష్, రిటైర్డ్ రుణ పాయింట్ హెడ్ జె.రామాంజనేయకుమార్, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు. పలువురు విద్యార్థులు అభిప్రాయాలను వెల్లడించారు. అతి తక్కువ వడ్డీ రేటుతో సకాలంలో రుణం మంజూరు చేసినందుకు బ్యాంకు ప్రతినిధులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

వీవీఐటీలో ముగిసిన ఎన్‌సీసీ వార్షిక శిక్షణ



పెదకాకాని: వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలోపది రోజులుగా నిర్వహిస్తున్న 10ఏ బెటాలియన్ బాలికల వార్షిక శిక్షణ శిబిరం శుక్రవారం ముగిసింది. వివిధ విద్యాసంస్థలకు చెందిన 632 మంది క్యాడెట్లు ఈ శిబిరంలో పాల్గొని దేశభక్తి, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంచుకున్నారని, తొలిసారిగా ఏర్పాటుచేసిన సాహస విన్యాస పోటీలలో విద్యార్థులు ప్రదర్శించిన స్ఫూర్తి ప్రశంసనీయమని బెటాలియన్ కమాండింగ్ అధికారి లెఫ్టినెంట్ కల్నల్ ఎస్ఏఎస్ సుదర్శన్ తెలిపారు. ఈ శిక్షణ శిబిరంలో క్యాడెట్లకు వ్యాయామం, పరుగు, యోగా, కవాతు ఆయుధాల పె అవగాహన, ఫైర్ ఫైటింగ్, సీపీఆర్, మ్యాప్ రీడింగ్, త్రివిధ దళాల అంశాలపై శిక్షణ ఇచ్చారు. రోప్‌వే, కొండలు ఎక్కడం వంటి సాహస విన్యాసాలతోపాటు వాలీబాల్, ఖోఖో వంటి ఆటలలో పోటీలు నిర్వహించి పురస్కారాలు అందించారు. పోటీలలో 25 మంది వీవీఐటీ విద్యార్థులు ప్రతిభ కనబరిచి పురస్కారాలు దక్కించుకున్నారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ అధికారి మేజర్ అవినాష్ పట్వాల్, వీవీఐటీ ఎన్‌సీసీ ఆఫీసర్ డాక్టర్ శ్రీవాణి, సిబ్బంది పాల్గొన్నారు.

భవిత పాఠశాలలకు ప్రభుత్వం పెద్దపీట

జిల్లా కోఆర్డినేటర్ జ్యోత్స్న

వేమూరు: ప్రభుత్వం భవిత పాఠశాలలకు పెద్దపీట వేస్తోందని జిల్లా కోఆర్డినేటర్ జ్యోత్స్న అన్నారు. మండలంలోని జంపనిలో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక అవసరాల పిల్లల సర్వేను ఆమె పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ 0-18 ఏళ్లలోపు పిల్లల్ని సర్వే చేస్తున్నట్లు చెప్పారు. భవిత కేంద్రాల్లో ఫిజియోథెరపీతో పాటు విద్యార్థులకు అనేక అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రత్యేక అవసరాల పిల్లలకు ప్రభుత్వం నాలుగు రకాల అలవెన్సులు అందిస్తోందని, వాటిని తల్లిదండ్రులంతా సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. ప్రత్యేక అవసరాల పిల్లల్ని గుర్తించడానికి మే ఒకటో తేదీ నుంచి సర్వే ప్రారంభించినట్లు తెలిపారు. నియోజకవర్గంలోని వేమూరు, కొల్లూరు, భట్టిప్రోలు, అమర్తలూరు, చుండూరు మండలాల్లో భవిత కేంద్రాలు ఉన్నాయన్నారు. జిల్లాలోని అన్ని మండలాల్లో ప్రత్యేక అవసరాల పిల్లల సర్వేను పరిశీలిస్తున్నట్లు ఆమె చెప్పారు.